క్లుప్తంగా

షాది మహల్ నిర్మాణ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు

సదుం: మండలంలోని భట్టువారిపల్లెలో షాది మహల్ నిర్మాణ పనులను మంత్రి పెద్దిరెడ్డి పీఏ మురళీకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి పరిశీలించారు. మైనార్టీల అభివృద్ధికి మంత్రి, ఎంపీ మిథున్‌రెడ్డి కృషి చేస్తున్నట్టు చెప్పారు. త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. సచివాలయాల మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, ఎల్లారెడ్డి ఉన్నారు.

కార్మిక చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు


అవగాహన కల్పిస్తున్న పారాలీగల్ వలంటీర్లు

పలమనేరు: ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా పట్టణ సమీపంలోని జాహ్నవి గార్మెంట్స్‌లో స్థానిక పారాలీగల్ వలంటీర్లు కార్మిక చట్టాలపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్మికుల పనివేళలు 8 గంటలకంటే మించి ఉండరాదన్నారు. కార్మిక చట్టాలను ఉల్లంఘించిన వారికి శిక్షలు తప్పవని హెచ్చరించారు. మైనర్లను పనుల్లో పెట్టుకోరాదని తెలిపారు.

విశ్రాంత ఉద్యోగులు ఈకేవైసీ చేసుకోవాలి

పుంగనూరు: విశ్రాంత ఉద్యోగులు ఈకేవైసీ చేసుకుని జూన్ 30వ తేదీలోపు ఈఫైలింగ్ చేయా లని ఆ సంఘం అధ్యక్షుడు చెంగారెడ్డి తెలిపారు. సోమవారం విశ్రాంత ఉద్యోగుల భవన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అందరూ లైఫ్ సర్టిఫికెట్లను ఎస్‌టీఓ కార్యాలయంలో అందజేయాలని కోరారు. విశ్రాంత ఉద్యోగులు రామకృష్ణారెడ్డి, చంద్రయ్య, సీతాపతిరాజు, దొరస్వామి, కేశవరెడ్డి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సర్పంచ్‌కు సన్మానం


దిగువపల్లె సర్పంచ్ సోనితో గ్రామస్తులు

చౌడేపల్లె: పంచాయతీ రాజ్ దినోత్సవం రోజున జిల్లా స్థాయిలో ఉత్తమ పంచాయతీ అవార్డు అందుకున్న దిగువపల్లె సర్పంచ్ సోనిని గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది సోమవారం సన్మానించారు. వార్డు సభ్యులు, అధికారుల సహకారంతోనే అవార్డు సాధించినట్టు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వసుంధర, వీఆర్వో రాజన్న తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకు ప్రారంభం


ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ రెడ్డెమ్మ

పలమనేరు: మండలంలోని బయ్యప్పగారి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ముసలిమొడుగు వద్ద నిర్మించిన పెట్రోల్ బంకును డీసీసీబీ చైర్మన్ మొగసాల రెడ్డెమ్మ, స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సోమవారం ప్రారంభించారు. గుడియాత్తం రోడ్డులో బంకు ఏర్పాటుతో వాహనదారులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని పీఏసీఎస్ చైర్మన్ రాజారెడ్డి తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లి క్రిష్ణమూర్తి, వైస్ ఎంపీపీ జయశ్రీ, నాయకులు బాలాజీనాయుడు, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పన్ను రాయితీలను సద్వినియోగం చేసుకోండి

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలో 2023 ఏడాదికి సంబంధించి పన్ను రాయితీలను పట్టణవాసులు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కిరణ్‌కుమార్ అన్నారు. ఆస్తి పన్ను డిమాండ్ రూ.2.94 కోట్లు కాగా ముందస్తుగా రూ.77.45 లక్షలు, నీటి పన్ను రూ.1.28 కోట్లకు రూ.17.32 లక్షలు, ఖాళీ స్థలాల పన్నులు రూ.48 లక్షలకు రూ.2.44 లక్షలను వసూలు చేసి లక్ష్య సాధనలో ముందంజలో ఉన్నట్లు పేర్కొన్నారు. ముందస్తుగా పన్నులు చెల్లించి ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుంటూ మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

కూలి అడిగినందుకు దాడి

సోమల: కూలి డబ్బులు అడిగినందుకు దాడి చేసిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్‌ఐ మారుతి సోమవారం తెలిపారు. మండలంలోని పెద్ద ఉప్పరపల్లె పంచాయతీ పరిధిలోని చింపిరెడ్డిగారిపల్లెకు చెందిన వెంకటరమణ 15 రోజుల క్రితం నగేష్‌కు కూలి పనులకు వెళ్లాడు. తనకు కూలి మొత్తాన్ని చెల్లించాలని అడిగినందుకు నగేష్, భార్య ఉషారాణి వెంకటరమణ అతని భార్య నాగరత్నపై దాడి చేసి గాయపరిచారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

మేడే సంబరాలు

- ఘనంగా కార్మికుల దినోత్సవం
- వాడవాడలా ర్యాలీలు, జెండా ఆవిష్కరణలు



పలమనేరులో ఐఎఫ్‌టీయూ నాయకుల ర్యాలీ

పలమనేరు: పట్టణంలో మేడే వేడుకలను కమ్యూనిస్టు పార్టీలు, వివిధ కార్మిక సంఘాలు, అంగన్‌వాడీ వర్కర్లు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరణ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు మాట్లాడుతూ.. కార్మికుల పోరాటాల నుంచి పుట్టిందే మేడే అన్నారు. ప్రపంచంలో కార్మికులకు మించిన శక్తి మరొకటి లేదన్నారు. ఆయా కార్యక్రమాల్లో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఓబుల్‌రాజు, ఉపాధ్యక్షుడు గిరి, అంగన్‌వాడీ సంఘం నాయకులు జ్యోతి, భారతి, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు యోగేష్‌బాబు, కేవీపీఎస్ నాయకులు ఈశ్వర్ పాల్గొన్నారు.

కార్మికుల సేవలు మరువలేనివి

పుంగనూరు: సమాజంలో అన్ని రకాల సేవలు అందిస్తున్న కార్మికుల సేవలు మరువలేనివని, వారి రుణం తీర్చుకోలేనిదని సీనియర్ సివిల్‌జడ్జి వాసుదేవరావు అన్నారు. సోమవారం మేడేని పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ.. వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులకు ప్రభుత్వపరంగా పథకాలు, రాయితీలు, బీమా సౌకర్యాలు అందించాలన్నారు. కార్మికులను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. మున్సిపల్ మేనేజర్ రసూల్‌ఖాన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటసుబ్బయ్య, న్యాయవాది షమివుల్లా పాల్గొన్నారు.

సోమల: మండలంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు మునిరాజ ఆధ్వర్యంలో మేడేను ఘనంగా నిర్వహించారు. గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్మికులు ప్రసాద్, శివకుమార్, రాంబాబు, సాదిక్, రవి పాల్గొన్నారు.

పెద్దపంజాణి: మండల కేంద్రంలో ఆటో యూనియన్ నాయకుడు తిప్పన్న అధ్యక్షతన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథులుగా జాతీయ మానవహక్కుల జిల్లా అధ్యక్షుడు మునిరత్నం, మాల మహానాడు మండల అధ్యక్షుడు మంజునాథ్ ప్రసంగించారు. కార్మికులకు కనీస వేతనాలు అందించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో వేలాయుధం, శివన్న, రెడ్డెప్ప, వెంకటేష్, రవికుమార్ పాల్గొన్నారు.


పుంగనూరు: మాట్లాడుతున్న న్యాయమూర్తి వాసుదేవరావు


మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు


పెద్దపంజాణి: నినాదాలు చేస్తున్న నాయకులు


సోమలలో గాంధీ విగ్రహానికి నివాళి

రామకుప్పం: స్థానిక పోలీస్‌స్టేషన్ సర్కిల్ నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించారు. కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు.

సదుం: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి ఆధ్వర్యంలో మేడే వేడుకలు జరిగాయి. నాయకులు సీతాపతి, రాజేష్, మాధవయ్య, కుమార్, జయచంద్ర, రమేష్ పాల్గొన్నారు.

వి.కోట: స్థానిక సర్పంచ్ లక్ష్మమ్మ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులను సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. ఉప సర్పంచ్ అక్మల్, ఈఓ యాదవపతి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగరాజు, శశికళ, వార్డు సభ్యులు కుమార్‌రాజా, మోహన్ రాజు, ఖాదర్ పాల్గొన్నారు.


కుప్పంలో..

శాంతిపురం: మేడే సందర్భంగా శ్రీవినాయక ఆటో యూనియన్ సభ్యులు మండల కేంద్రంలో సంబరాలు చేసుకున్నారు. యూనియన్ అధ్యక్షుడు మురుగేష్ ఆచారి ఆధ్వర్యంలో అమరులైన కార్మికులకు నివాళి అర్పించారు.


వి.కోట: సన్మానం అందుకున్న పారిశుధ్య కార్మికులు


రామకుప్పంలో..


పలమనేరు: జెండా ఆవిష్కరణ చేస్తున్న సీఐటీయూ నేతలు


సదుంలో..

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి


కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ భరత్

- ఎమ్మెల్సీ భరత్

కుప్పం: కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. సోమవారం కార్మికుల దినోత్సవం సందర్భంగా పట్టణంలో జరిగిన మేడే వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. షాదీమహల్లో జరిగిన సమావేశంలో భరత్ మాట్లాడుతూ.. కార్మికుల కష్టం వెలకట్టలేనిదని, కుప్పం నియోజకవర్గంలోని ప్రతి కార్మికుడి సమస్యను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అనంతరం షాదీమహల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్మికుల భవన్ వద్ద జెండా ఆవిష్కరించి మేడే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రెస్కో చైర్మన్ సెంథిల్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సుధీర్, కార్మిక సంఘం నేత రంగయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే కుప్పం ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో జరిగిన వేడుకలో జూనియర్ సివిల్ జడ్జి భారతి పాల్గొని కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు.

కల్పవృక్ష వాహనంపై కోనేటిరాయుని వైభవం


కల్పవక్ష వాహనంపై విహరిస్తున్న స్వామివారు

గంగవరం: కీలపట్లలోని శ్రీకోనేటిరాయస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం ఉదయం స్వామివారు శ్రీకృష్ణుడి అవతారంలో రుక్మిణీ సత్యభామ సమేతంగా కల్పవృక్ష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. తిరువీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. కోనేటిరాయస్వామికి ఉదయం అభిషేకం, నైవేద్యం, మహా మంగళహారతి సమర్పించారు. ఆస్థాన మండపంలో స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ జరిగింది. రాత్రి కోనేటిరాయుడు సర్వభూపాల వాహనంపై గ్రామ మాడ వీధుల్లో భక్తులకు అభయమిచ్చారు. చెక్కభజనలు, కోలాటాలు, సంగీత, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ వాహన సేవలు కోలాహలంగా సాగాయి. నేడు జగన్మోహిణి ఉత్సవం, సాయంత్రం శ్రీవారి కల్యాణోత్సవం, రాత్రి గరుడసేవ నిర్వహిస్తున్నట్లు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అందరి సహకారంతోనే విజయవంతం

సోమల: ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహసారథులు సమష్టిగా పనిచేయడం వల్లే జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమం మండలంలో విజయవంతం అయినట్లు ఎంపీపీ ఈశ్వరయ్య, పార్టీ మండల కన్వీనర్ గంగాధరం అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ.. మండలంలో మొత్తం 9,933 కుటుంబాలను కలిసి ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయాలు తెలుసుకున్నామన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, జేసీఎస్ మండల కన్వీనర్ మధు, వైఎస్ ఎంపీపీలు ప్రభాకర, సయ్యద్ బాషా, నాయకులు అమాస మోహన్, నాగేశ్వరరావు, నాగభూషణం రెడ్డి పాల్గొన్నారు.

5న గోవిందపల్లిలో కబడ్డీ పోటీలు

రామకుప్పం: మండలంలోని ఉన్సిగానిపల్లి పంచాయతీ గోవిందపల్లి గ్రామంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ.30 వేలు, రెండో బహుమతి రూ.20 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు, నాలుగో బహుమతి రూ.5 వేలు అందించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల జట్లు ఎంట్రీ ఫీజు రూ.500 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 89782 49938 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

కారును ఢీకొన్న లగేజీ వాహనం

సోమల: కర్ణాటక రాష్ట్రం ముళబాగల్‌కు చెందిన ప్రసాద్ తన కుటుంబంతో ఆదివారం సాయంత్రం ఎర్రావారిపాళ్యానికి కారులో బయలుదేరాడు. మార్గమధ్యలో సోమల మండలం కరకమంద వద్ద వీరి వాహనాన్ని ఎదురుగా వస్తున్న గూడ్స్ క్యారియర్ వాహనం ఢీకొంది. కారు దెబ్బతినడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎస్‌ఐ మారుతి తెలిపారు.

విద్యారంగం పటిష్టతకు కృషి

- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి


ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డికి సమస్యలను విన్నవిస్తున్న 98 డీఎస్సీ టీచర్లు

పలమనేరు: విద్యారంగాన్ని మరింత పటిష్టం చేసేందుకు కృషి చేస్తామని తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని విశ్రాంత ఉపాధ్యాయ సంఘం నేత సోమచంద్రారెడ్డిని సోమవారం కలిశారు. పలు విషయాలపై చర్చించారు. తన గెలుపునకు కారణమైన ముఖ్యులను కలిసే పనిలో భాగంగా ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. 1998 డీఎస్సీ ద్వారా ఉద్యోగాలను పొందిన పలమనేరు ఉపాధ్యాయులు ఎమ్మెల్సీని సన్మానించి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పదవీ విరమణ కాలాన్ని 62 ఏళ్లకు పెంచితే బాగుంటుందని విన్నవించారు. దీనిపై ప్రభుత్వంతో మాట్లాడుతానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో 98 డీఎస్సీ అధ్యక్ష, కార్యదర్శులు పట్టాభిరామయ్య, రోషల్ అలీఖాన్, ఏఆర్ కుమార్ పాల్గొన్నారు.

ఆలయాలకు ఎంపీ మిథున్‌రెడ్డి విరాళం

సదుం: మండలంలోని మొరవపల్లె పంచాయతీ చీకలచేను ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి రూ. 65 వేల విరాళాన్ని అందజేసినట్లు సర్పంచ్ జగన్నాథం సోమవారం తెలిపారు. అలాగే పచ్చార్ల మాకులపల్లె రామాలయానికి రూ. 15 వేలు విలువ చేసే మైక్‌సెట్‌ను అందజేసినట్లు చెప్పారు.

వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

సదుం: మండలంలోని బూరగమంద భూదేవి, శ్రీదేవీ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో సోమవారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో ధ్వజారోహణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి వెంకటరమణ, దేవాంగ సమాజసభ్యులు ఉభయదార్లుగా వ్యవహరించారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సన్మానం

పుంగనూరు: పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డిని ఉపాధ్యాయులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అకాడమి డైరెక్టర్ చంద్రమోహన్‌రెడ్డి ఎమ్మెల్సీని సన్మానించారు.

ఎమ్మార్సీకి చేరిన విద్యాకానుక సామగ్రి


యూనిఫామ్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ

పలమనేరు: వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ విద్యార్థులకు అందించనున్న జగనన్న విద్యాకానుక తొలి విడత సామగ్రి స్థానిక ఎమ్మార్సీకి సోమవారం చేరింది. యూనిఫామ్‌ను ఎంఈఓ లీలారాణి పరిశీలించి స్థానిక హైస్కూల్లో భద్రపరిచారు. మిగిలిన సామగ్రి అందాక కిట్లుగా చేసి మండలంలోని 7117 మంది విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు ఆమె తెలిపారు.

లోకోస్ యాప్‌పై శిక్షణ

పుంగనూరు: ఐకేపీ మహిళలందరూ లోకోస్ యాప్‌పై అవగాహన పెంచుకోవాలని.. తద్వారా అనేక ప్రయోజనాలు పొందేందుకు వీలుందని ఐకేపీ ఏపీఎం రవి అన్నారు. సోమవారం నాలుగు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని మండల సమాఖ్యలో ప్రారంభించారు. ఈ యాప్ ద్వారా చెల్లింపులు, పొదుపుతో పాటు లావాదేవీలను క్రోడీకరించుకోవడం, స్టేట్‌మెంట్లు తయారు చేసుకోవడానికి వీలుందన్నారు. అలాగే ఖాతాల వివరాలు, లావాదేవీలు, ప్రాథమిక సమాచారాన్ని కూడా తెలుసుకోవచ్చని తెలిపారు. తొలి రోజు శిక్షణలో సీసీలు గంగాధర్, శివశంకర్, నాగరత్న, శారదమ్మ పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

పెద్దపంజాణి: మండలంలోని చలమంగళం గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న 8 మంది జూదరులను సోమవారం అరెస్టు చేసినట్లు ఏఎస్‌ఐ చంద్రబాబు తెలిపారు. మందస్తు సమాచారం మేరకు వ్యవసాయ పొలాల వద్ద పేకాట ఆడుతున్న వారిపై తన సిబ్బందితో కలిసి పట్టుకున్నామని తెలిపారు. వారి వద్ద నుంచి రూ.11 వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వ్యక్తి పై కేసు నమోదు

పెద్దపంజాణి: మండలంలోని వీరప్పల్లి సచివాలయ మహిళా పోలీస్‌ను కులం పేరుతో అసభ్యకరంగా దూషించిన కెళవాతి గ్రామానికి చెందిన ఎర్రబల్లి శ్రీనివాసులుపై పలు సెక్షన్ల కింద సోమవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ చంద్రబాబు తెలిపారు. దీనిపై విచారణ చేస్తున్నట్లు చెప్పారు.

జగనన్న పాలనకు జనహారతి


సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

- ప్రతి గడపలో విశేష స్పందన
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పాలనపై జనం చాలా సంతృప్తితో ఉన్నారని.. గడప గడపకు మన ప్రభుత్వానికి వస్తున్న ఆదరణే ఇందుకు నిదర్శనమని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. పలమనేరు మున్సిపాలిటీ 5,7 వార్డుల్లోని బీసీ కాలనీ, ఇందిరమ్మ కాలనీల్లో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులతో కలిసి సోమవారం పర్యటించారు. ప్రతి గడపకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ లబ్ధిని వివరించారు. పలు సమస్యలను అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అన్ని వర్గల వారికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. ఏ ఇంటికి వెళ్లినా ప్రభుత్వ పాలనపై హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. మళ్లీ జగనన్నే సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు అడ్రస్ గల్లంతు కావడం ఖాయమని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర, వైస్ చైర్మన్లు చాన్మాకమాల్, కిరణ్‌కుమార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ, టౌన్ కన్వీనర్ జాఫర్, పీఏసీఎస్ చైర్మన్ రఘునాథ్, నాయకులు మండీ సుధా, మున్నా షర్మిల, శ్యామ్, హయాత్, కోదండరామయ్య, హేమంత్, నాజియ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారం


చెలిమిగడ్డలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ

పుంగనూరు: రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతాల్లోని విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని మంగళం, చెలిమి గడ్డ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా విద్యుత్‌లైన్ల మార్పిడి, స్తంబాల ఏర్పాటును పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అలాగే ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న మంగళం నుంచి కృష్ణాపురం రోడ్డు పనులను ప్రారంభించారు. మండలంలో అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రాజారెడ్డి, రాంమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా గంగచాటు


అమ్మవారి గెరిగను ఆలయానికి తీసుకొస్తున్న భక్తులు

పలమనేరు: పలమనేరు గంగమ్మ జాతరలో భాగంగా ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు చాటింపు వేశారు. ఈనెల 14 నుంచి పట్టణంలో తిరుపతి గంగమ్మ జాతర జరగనుంది. ఈ సందర్భంగా గుండుబావి వద్ద గంగరాతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి గెరిగ కుండను బజారువీధి మీదుగా గంగమ్మ ఆలయానికి మేళతాళాలు, మంగళవాయిద్యాలతో తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. ఆలయం వద్ద అభిషేకించారు. పట్టణ వీధుల్లో బలిహరణం చేస్తూ జాతర చాటింపు వేశారు. శాలివాహణ, కుమ్మర సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి సారెను పెట్టి పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమం జరిగింది.

ఐక్యతతో అత్యధిక మెజార్టీ సాధిద్దాం



అభినందన సమావేశంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

సదుం: రానున్న ఎన్నికల్లో ఐక్యతతో మండలంలో వైఎస్సార్‌సీపీకి అత్యధిక మెజార్టీ వచ్చేలా పనిచేద్దామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి అన్నారు. మండలంలో జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం విజయవంతంగా పూర్తయిన సందర్భంగా నాయకులు, ప్రజాప్రతినిధులు, గృహసారథులతో సోమవారం అభినందన సమావేశం నిర్వహించారు. ప్రజల మన్ననలు పొందేలా అందరూ నడుచుకోవాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడే వారికి మంత్రి కుటుంబం అండగా ఉంటుందని చెప్పారు. మండలంలో 10,654 కుటుంబాలు ఉండగా 8,416 కుటుంబాల్లో సర్వే పూర్తయినట్లు సచివాలయాల మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, సింగిల్‌విండో చైర్మన్ తిమ్మారెడ్డి, వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, మండల కన్వీనర్ రెడ్డెప్ప రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.